# ప్రశాంతి

"మనం చరిత్ర నుంచి నేర్చుకోక, పడిన గోతిలోనే మళ్లీ మళ్లీ పడుతున్నాం. లేకపోతే ఈ అరాజకమేమిటి?" అన్నాడు దిబ్బజ్ఞాని.

"దీనికీ చరిత్రకూ సంబంధ ఉన్నదా?" అన్నాను.

"అరాజకమనేది చరిత్రకు తరచుగా వచ్చే జ్వరం. అది చరిత్ర అంత ప్రాచీనమైనది."

"మిడిగుడ్ల రాజావారి టైములో చెప్పనలవికాని అరాజకం వచ్చింది. ఎక్కడ చూసినా దరిద్రం తాండవించింది. దొంగతనాలూ, దోపిడీలూ, హత్యలూ, గృహ దహనాలూ విచ్చలవిడిగా జరిగాయి. మా తాతగారి పొరుగున ఉండే ఇంట్లో తిండి కోసం దొంగలుపడి, అడ్డం వచ్చిన అరవై ఏళ్ల ముసలి ముండను చంపారు.

"రాజావారు చేయగలిగినదంతా చేశారు. గుళ్లలో అర్చనలు చేయించారు. క్షుద్ర దేవతలకు బలులు ఇప్పించారు. వర్తకులమీద పన్నులూ, భూస్వాముల శిస్తులూ మాఫీ చేశారు. ఏమీ లాభం లేకపోయింది.

"అప్పుడు రాజావారు ఏం చేశారనుకున్నావు? రాత్రయేది, పగలయేది. వీథుల్లో తిరిగితే చంపెయ్యమని గస్తీవాళ్లకు ఉత్తరువులిచ్చారు. మొదట కొద్ది రోజులు వీథుల్లో కొందరిని చంపారట. ఆ తరవాత దొంగతనాలూ, దోపిడీలూ, కొంపలు తగలబెట్టటాలూ నిలిచిపోయాయి.

"మూడు మాసాలపాటు మనుషుల మధ్య సంపర్కాలు లేక కొందరు రోగులు చచ్చారనీ, కొందరు ఆహార పదార్థాలు కొనటానికి బయటికిపోతే ఆకలికి మాడి చచ్చారనీ, ఇలాగే ఇతర కారణాలవల్ల ఇంకా కొందరు చచ్చారనీ అన్నారు. జనం చస్తేనేం? జనం చావకుండా ఎందుకుంటారు? కాని, రాజావారి ఎత్తు బ్రహ్మాస్త్రంలాగా పనిచేసి, తక్కున శాంతి నెలకొన్నది" అని దిబ్బజ్ఞాని ముగించాడు.

***ముద్రణ : యువ, మే 1977***